www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 10 నవంబర్ 2022
5
అన్నమయ్య

జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లాలోని పలువురు ఎస్ఐలను పోలీసు యంత్రాంగం బుధవారం బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. చిన్నమండెం ఎస్ఐ రామాంజనేయులు మదనపల్లి 1వ పట్టణ ఎస్ఐగా బదిలీ అయ్యారు. పెనగలూరు ఎస్ఐ చెన్నకేశవ అన్నమయ్య జిల్లా సైబర్ క్రైమ్‌కు, వీరబల్లి ఎస్ఐ మహమ్మద్ రఫీ అన్నమయ్య ఎస్‌బికి, ఎస్‌బి ఎస్ఐ వెంకటేశ్వర్లు రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు, ఎస్‌బి ఎస్ఐ నాగేశ్వరరావు, సిసిఎస్‌కు, డిసిఆర్‌బి ఎస్ఐ బాలకృష్ణ సైబర్ క్రైమ్‌కు, సైబర్ క్రైమ్ ఎస్ఐ హేమాద్రి, పెనగలూరుకు, రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ బాబు చిన్నమండెంకు, పిసిఆర్ ఎస్ఐ జయరాముడు రాయచోటి ట్రాఫిక్‌కు, ఎస్‌బి ఎస్ఐ రహీముల్లా వీరబల్లికి, ఎస్‌బి ఎస్ఐ శ్రీనివాస్ నాయక్ దిశా పోలీస్ స్టేషన్‌కు, అర్బన్ ఎస్ఐ నారాయణ పిసిఆర్‌కు, సిసిఎస్ ఎస్ఐ రమణయ్య పీలేరు అర్బన్ ఎస్ఐగా బదిలీ అయినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

అనీమియా నివారణపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

జిల్లాలో అనీమియా నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తిగా నివారించాలని కలెక్టర్ గిరీష సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని నారాయణరాజుపోడు గ్రామ సచివాలయం-2, విపిఆర్ కండ్రిక గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనీమియా నివారణకు అంగన్వాడీ సెంటర్ల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేస్తోందన్నారు. సచివాలయాల పరిధిలోని ఎఎన్ఎం, మహిళా పోలీసులు అనీమియా బాధితులకు పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా తరచూ పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఎంత మంది గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఉన్నారు? ఎంత మంది రక్తహీనతతో బాధపడుతున్నారు? అనే వివరాలు తెలుసుకుని రక్తహీనతతో బాధపడే వారందరికీ ఐరన్ టాబ్లెట్లు పౌష్టికాహారం అందేటట్లు ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు చూడాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అనీమియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సంబంధిత అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి రక్తహీనతను పూర్తిగా నివారించాలన్నారు. రక్తహీనత పరీక్షలలో ఎటువంటి తేడా లేకుండా జాగ్రత్తగా చేయాలని ఎఎన్ఎంకు సూచించారు. మహిళా పోలీస్ రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా పోలీసులు చేసే ప్రతి పని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి సిమెంటు, స్టీలు, ఇసుక సకాలంలో ఇవ్వడం జరుగుతుందని లబ్ధిదారుల అందరూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం పాఠశాలలో ఎలా అమలు అవుతుందని, మెనూ ప్రకారం సమయానికి భోజనం అందిస్తున్నారా లేదా అనే వివరాలను వెల్ఫేర్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకుని పాఠశాలలను తరచూ తనిఖీలు చేస్తూ ఉండాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న అమ్మఒడి, రైతు భరోసా వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితా, ఎస్ఎల్ఎ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, తహశీల్దార్ రామ్మోహన్, ఎంపిడిఒ నాగార్జునరావు, జడ్‌పిటిసి రత్నమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. మూగజీవాలు మృత్యువాత

విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన పశువులు

ప్రజాశక్తి-నందలూరు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తీగలు తగిలి మూగజీవాలు మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని పాటూరు పంచాయితీ పెద్దూరు గ్రామంలో చోటుచేసుకుంది. పెద్దూరులో బుధవారం తెల్లవారుజామున కరెంటు తీగలు తగిలి నాలుగు పశువులు మృతి చెందాయి. 11 కెవి కరెంటు లైన్ నేల నుండి మూడు అడుగుల ఎత్తులో ఉండడంతో ఎనుములు వెళుతున్న దారిలో కరెంటు తీగలు తగిలి మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తవ్వాకుల వెంకటసుబ్బయ్య, తోట శ్రీనివాసులు బుధవారం ఉదయం 6:30 గంటలకు తమ పశువుల నుండి పాలు పిండుకొని మేత కోసం గేదెలను వదిలివేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఆ పశువుల విద్యుత్ తీగలకు బలై మృతి చెందాయి. వాటర్ మోటారు వేయమని శీను దగ్గర పనిచేస్తున్న ఎల్లయ్యను పొలంలోకి పంపగా ఆ పశువులు విగతాజీవులుగా పడి ఉండడంతో కేకలు వేస్తూ యజమాని దగ్గరికి వెళ్లి పశువులు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరుగున యజమానులు సంఘటన స్థలికి వెళ్లి చూడగా పశువులు మృతి చెంది ఉన్నాయి. నాలుగు పశువులు రూ.1.40 లక్షలు ఉంటుంది. పశువుల పాడితో బతుకుతున్న తమ కుటుంబాలు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో విద్యుత్ తీగలు కిందికి జారీ ఉన్నాయి, వాటిని సరి చేయండి అని స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, ఎఇ దృష్టికి ఎన్నిసార్లు సమస్యను తీసుకువెళ్లిన వారు పట్టించుకోకపోవడం వల్లే ఇటువంటి దుర్ఘటన జరిగిందని కన్నీరు మున్నీరయ్యారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు.

నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న కాలనీలలో ఇళ్ళ నిర్మాణంలో ఆర్‌సి దశ నుంచి ఇళ్లు పూర్తి దశకు లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. బుధవారం మన బడి నాడు-నేడు కింద నిర్వహిస్తున్న పనుల పురోగతి, జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ గిరీష తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనబడి నాడు-నేడు కింద 1710 ప్రాజెక్టులు చేపట్టామన్నారు. పాఠశాల పనితీరు నివేదిక ప్రకారం అన్నమయ్య జిల్లా ర్యాంకు 6వ స్థానంలో ఉందని, వచ్చే సమీక్షా సమావేశంలో జిల్లా ర్యాంకును మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. ఖర్చు శాతం 65 శాతం కంటే తక్కువగా ఉన్న మొదటి ఐదు మండలాల ఎంఇఒలను ఎందుకు తక్కువగా ఖర్చు చేశారని ఆయన ప్రశ్నించారు. రాజంపేట, నందలూరు, చిట్వేల్ తదితర మండలాల్లో ఖర్చు తక్కువగా ఉందన్నారు. అన్ని మండలాల ఖర్చును 80 శాతానికి పెంచాలని ఆయన ఆదేశించారు. స్థల సమస్యలు, ఇసుక సమస్య కారణంగా ఆ మొత్తాన్ని ఖర్చు చేయలేకపోతున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. జగనన్న గృహాల లేఅవుట్లలోని ఇళ్ల మ్యాపింగ్, రిజిస్ట్రేషన్లు, జియోట్యాగింగ్ తదితర అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, పీడీ హౌసింగ్, ఎఇలు, డిఇలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జియోట్యాగింగ్ బాగా జరుగుతోందని, మరో 440 ఇళ్లకు జియోట్యాగింగ్ చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో జియోట్యాగింగ్ పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. వచ్చే వారంలోగా జియోట్యాగింగ్ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కోడూరు తదితర మండలాల్లో ఎఫ్‌టీఓలు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను అడిగారు. ఈ సందర్భంగా, హౌసింగ్ లేఅవుట్‌లలోని ఇళ్ల స్థలాల మార్పిడిపై ఇంజినీరింగ్ సహాయకులతో ఎప్పటికప్పుడూ సమీక్షించాలని ఎంపిడిఒలను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ ఎంఎస్ కోడ్‌లను కూడా ఆయన సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న అన్ని కోడ్‌లను త్వరలో క్లియర్ చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, డిఇ, ఎంఇఒలు, ఫీల్డ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

రైతు సమాఖ్య సంఘాలను బలోపేతం చేయండి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రైతు గ్రామ సమాఖ్య సంఘాలను బలోపేతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తవళం రైతు భరోసా కేంద్రంలో నిమ్మనపల్లి, తవళం గ్రామంలోని కుమార అహోబిలనాయని చెరువు, కోమటివాని చెరువు ఆయకట్టు రైతులతో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ ముజీబ్, మదనపల్లి ఎడిఎ శివశంకర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాధి పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ (జైకా) జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాధి అభివృద్ధి పథకం అమలులో భాగంగా రైతు ఆసక్తి సంఘాలు, గ్రామ సమైఖ్య సంఘాలను ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేయడంపై కోమటివాని చెరువు, కుమార అహోబిలనాయాని చెరువు ఆయకట్టు దారులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామ సమాఖ్య సంఘాలను ఏర్పాటు చేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ పథకం ద్వారా చిన్న తరహా నీటిపారుదలలో సంఘాలు ఏర్పాటు చేసి, వారికి మార్కెట్ అవకాశాలను మెరుగుపరచి ఆయకట్టుదారుల వ్యవసాయ ఉత్పత్తి ఆదాయాన్ని పెంచడం జరుగుతుందన్నారు. రైతు సంఘాల ఏర్పాటుకు అనుసరించాల్సిన నియమ నిబంధనలను తెలియజేశారు. ఎపిఐఎల్ఐపి-2 ప్రాజెక్టు ఎపిడి కుమార్ మాట్లాడుతూ రైతు ఆసక్తి, గ్రామ సమాఖ్య సంఘాల ఏర్పాటు ప్రణాళిక తయారు చేయడంలో వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో మార్కెటింగ్, శిక్షణ, వర్క్ షాప్ నిర్వహణ చేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో అధ్యయన యాత్రలు నిర్వహిస్తామన్నారు. ఆయకట్టుదారుల పంటల ఉత్పత్తిని పెంపొందించడం, మార్కెటింగ్ సదుపాయలను బలోపేతం చేయడం, ఆధునికీకమైన సౌకర్యవంతమైన మార్కెట్ గిడ్డంగుల సౌకర్యాల చేస్తామని తెలిపారు. తద్వారా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల ఆదాయం పెంచవచ్చన్నారు. జీవనోపాదుల పెంపుదల గురించి సిబ్బందికి శిక్షణ, ఆధునిక పంటల యజమాన్య పద్ధతుల గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయకట్టు రైతులు గ్రామ సమాఖ్య సంఘాలగా ఏర్పడడం ద్వారా సంఘ సభ్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, సర్పంచ్ రెడ్డప్ప, ఎఇఒ లక్ష్మీప్రసన్న, వీఆర్వో రామకృష్ణ, వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, కుమార్‌నాయక్, రిసోర్స్ పర్సన్ సుధాకర్‌రెడ్డి, ఎస్ఒ సంఘ సభ్యులు బాలాజీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

నేడు నిమ్మనపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లీలా మాధవి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా హాజరవుతున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను తీసుకురావాలని తెలిపారు.

రిలేదీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న చంద్రశేఖర్

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు రూరల్

పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, యూనియన్ గౌరవాధ్యక్షులు దాసరి జయచంద్ర, అధ్యక్షులు కప్పల రాణి, ప్రధాన కార్యదర్శి సత్యాల చెన్నయ్య పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు మూడో రోజైన బుధవారం విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే జీతాలు చెల్లించాలని, చట్టపకారం ఆదాయంలో సగభాగం జీతాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. టెండర్ల వేసుకున్న రూ.18 వేలు అమలు చేయాలన్నారు. నేటి ధరల పెరుగుదలతో రూ.పది వేలతో ఎలా జీవించాలని ప్రశ్నించారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. గతంలోనే సమ్మె నోటీస్ ఇచ్చామని తెలిపారు. జీతాలు పెంచుతామంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. పెండింగ్ జీతాలు ఇచ్చే వరకు, కనీస వేతనం అమలు చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పెంచలమ్మ, లక్ష్మీదేవి, పోళ్ళమ్మ, గజా, తేజ పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో అప్రెంటీస్ నియామకాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఐటిఐలో ఉత్తీర్ణులైనమ అభ్యర్థులకు ఆర్‌టిసిలో అప్రెంటీస్ నియామకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శేషారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత పరీక్ష లేకుండానే నియామకం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు విద్యార్హత పత్రాలు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, సంతకంతో కూడిన ఫొటోను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

కిక్ బాక్సింగ్‌లో జగదీశ్వర్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆర్.జగదీశ్వర్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీసాయి స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు ఎం.విజయ్ కుమార్, జగదీశ్వర్ తండ్రి నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ నుండి 6వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలో జగదీశ్వర్ పాల్గొన్నారన్నారు. మదనపల్లె నుండి నలుగురు విద్యార్థులు పాల్గొన్నగా జగదీశ్వర్ గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. జగదీశ్వర్ ఎంతో చురుకుగా ఉంటూ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో రాణించాడని పేర్కొన్నారు. గతంలో పూణే, కలకత్తాలలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారన్నారు. విజయవాడలో జరిగిన కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ పోటీల ఎంపిలో జగదీశ్వర్ ప్రథమ స్థాయిలో రాణించారని తెలిపారు.

బాక్సింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన జగదీశ్వర్

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

అంగన్వాడీలకు రూ.26 వేల వేతనమివ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అంగన్వాడీ కార్యకర్తలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో సిఐటియు జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో అంగన్వాడీల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ సూపర్‌వైజర్లుగా పదోన్నతిలో ప్రభుత్వం అంగన్వాడీల మధ్యన చిచ్చుకు ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. సీనియర్ అంగన్వాడీ కార్యకర్తలను సూపర్‌వైజర్లుగా నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయమే బూటకమని తెలిపారు. ప్రభుత్వం అవలంబిస్తున్న నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సి.హెచ్.చంద్రశేఖర్, ఎన్.శంకరమ్మ, పెనగలూరు మండలం సిఐటియు కార్యదర్శి ప్రసాద్, అంగన్వాడీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఈశ్వరమ్మ, విజయ, కార్యకర్తలు రాజేశ్వరి పాల్గొన్నారు.

న్యాయ సహాయాన్ని పొందవచ్చు: జడ్జి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని ఎవరైనా పొందవచ్చునని సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి పి.భాస్కరరావు పేర్కొన్నారు. బుధవారం న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ నెల 12వ తేదీన జరగబోయే మెగా లోక్‌అదాలత్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏళ్ల తరబడి పరిష్కారం కాని కేసులు లోక్ అదాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్, లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. టూ టౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో లీగల్ సర్వీసెస్ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదని, విద్యార్థులు తప్పకుండా చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. చాలా సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న కేసులన్నీ లోక్ అదాలతో ద్వారా పరిష్కరించడం హర్షనీయమని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆర్.కృష్ణవేణి, అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జడ్జిభాస్కరరావు

సంపద తయారీ..ఉత్తి మాటే..!

ప్రజాశక్తి-వీరబల్లి

చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యం పక్కదారి పట్టింది. గ్రామాల్లో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన కేంద్రాలు చాలావరకు పనిచేయడం లేదు. తడి, పొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీకి అనుగుణంగా చేసిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. తొలి రోజుల్లో సజావుగా నడిచినప్పటికీ తర్వాత నిర్వహణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ప్రస్తుతానికి కొన్నిచోట్ల ఉపయోగిస్తున్నారు. మిగతా చోట్ల నిరుపయోగంగా మారాయి.

నిధులు వ్యయంతో ప్రయోజనం శూన్యం

మండలంలోని 12 గ్రామాల్లో రూ. లక్షలు ఖర్చుచేసి చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్మించారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను తడి పొడిగా వేరుచేసి వర్మి కంపోస్టుగా మార్చేందుకు వీలుగా తొట్లను ఏర్పాటు చేశారు. చెత్త సేకరించేందుకు రిక్షాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. హరిత రాయబారులను నియమించారు. గ్రామాల్లో గతంలో నిర్మించిన సంపద కేంద్రాల్లో ఉన్న తొట్లు పడిపోవడంతో మళ్లీ నిర్మించి నిరుపయోగంగా వదిలేశారు.

అందుబాటులోకి తెస్తాం

మండలంలోనిడి. రాచపల్లి, పెద్దవీడు, ఒంగిమళ్ళ, సోమవరం, మట్లి, ఓదివీడు, తాటికుంటపల్లి, సానిపాయ, గుర్రప్పగారిపల్లి, సంఘ మాండ్లపల్లి, వీరబల్లి, గడికోట, గ్రామాల్లో వీరబల్లి సంపద కేంద్రం ఫైర్ ఆక్సిడెంట్‌లో కాలిపోయింది, మండలంలో కొన్ని సంపద కేంద్రాలు ఉన్నావాటిలో కొన్ని లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. సంపద కేంద్రాల్లో వర్మి కంపోస్టు తయారు చేయడం లేదన్నారు. మిగతా చోట్ల సంపద కేంద్రాల్లో ఎరువులు తయారు చేస్తున్నారని తెలిపారు.

- సురేష్ బాబు, ఇఒపిఆర్‌డి.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

భూ బకాసురుల భరతం పడతాం : 'బత్యాల'

ప్రజాశక్తి-నందలూరు

రాజంపేట నియోజకవర్గంలో భూ కబ్జాలు చేస్తున్న అధికార పార్టీ భూ బకాసురుల భరతం పడతామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్రాయుడు అన్నారు. బుధవారం పాటూరు పంచాయతీలోని ఎర్రిపాపయ్యగారిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ భూములకు విముక్తి కలిగించి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఆకేపాడును మింగేశారని ఒక వర్గం నందలూరు మండలాన్ని మింగేశారని మరో వర్గం ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ భూ కబ్జాలపై ఒకరి తరువాత ఒకరు కలెక్టర్ గిరీషకు ఫిర్యాదు చేశారన్నారు. అధికార పార్టీ నేతలు ఒంటిమిట్ట, సిద్ధవటం, వీరవల్లి, నందలూరు మండలాలతో పాటు ఇతర ప్రాంతాలలో భూ కబ్జాలకు పాల్పడ్డారని భూ బకాసురులపై కలెక్టర్ విచారణ చేసి కబ్జా భూములను ప్రభుత్వం ఆధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. గతంలో తాను కోడూరు నుండి ప్రాతినిధ్యం వహించినప్పుడు పెనగలూరు మండలంలో కబ్జా అయిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని డ్వాక్రా మహిళలకు ఇచ్చామన్నారు. ఆ భూములు ఇరిగేషన్ అధికారుల స్వాధీనంలో ఉన్నాయన్నారు. రాజశేఖర్‌రెడ్డి తన కుటుంబం పేరుతో ఉన్న పెనుగులూరు మండలంలోని 300 ఎకరాలు ప్రభుత్వానికి అందజేసి పేదలకు పంచారని గుర్తుచేశారు. ఇడుపులపాయలోని 160 ఎకరాలను ట్రిపుల్‌ఐటికి ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని కబ్జాదారుల ఆధీనంలో ఉన్న మామిడి తోటలను పేదలకు కచ్చితంగా పంచుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, టిడిపి మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపిపి పల్లె సుబ్రహ్మణ్యం, టిఎన్ఎస్ఎఫ్ వేణుగోపాల్, టిడిపి నాయకులు తాటి సుబ్బరాయుడు,చామంచి పెంచలయ్య, యానాది, పాటూరు శ్రీను, గంధం గంగాధర్, జ్యోతి శివ, చుక్క యానాది, సురేష్, గొబ్బిళ్ళ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు

వెంగంవారిపల్లెలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ అభిషేక్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గ్రామాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిమ్మనపల్లి పిహెచ్‌సి డాక్టర్ అభిషేక్ అన్నారు. కుటుంబ వైద్యుడి విధానంలో భాగంగా బుధవారం వెంగంవారిపల్లిలో 104 వాహనం ద్వారా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో కుటుంబ వైద్యుడి విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలకు గ్రామాల్లో వైద్య సేవలు నిర్వహించి వారికి ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను గ్రామీణ ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో రోగులకు ప్రాథమిక పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 104 వాహనం డాక్టర్ ఇందుశ్రీ, సిబ్బంది కిరణ్, పాల్గొన్నారు.

నూతన ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

నూతన ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో నూతన ఓటర్ల జాబితాను సర్పంచ్ జంబు సూర్యనారాయణ, వీఆర్వో ముప్పాల రాజు ప్రజల సమక్షంలో విడుదల చేశారు. బుధవారం అరవపల్లిలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా నూతన ఓటర్ల జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆదివారం సంబంధిత పోలింగ్ బూతుల వద్ద బిఎల్వోలు ఓటర్ల జాబితాతో అందుబాటులో ఉంటారని ప్రజలు తమ ఓటును పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాల్లో వీఆర్వోలు కూడా ఉంటారని జాబితాలో ఓటు సమస్య ఏదైనా ఉంటే వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఓటర్లు, గ్రామస్తులు, వాలంటీర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ లక్ష్మీపతి

గృహ నిర్మాణ పనులు తనిఖీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణం సమీపంలో బద్దిపల్లి వద్దనున్న జగనన్న గృహ నిర్మాణాలను బుధవారం మదనపల్లె డిఎల్‌పిఒ లక్ష్మీపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదవాడి సొంతింటి కలన సాకారం చేయడానికి కృషి చేస్తుందన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ప్రోత్సహిస్తోందన్నారు. ఇక బద్దిపల్లి జగనన్న కాలనీలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు చేశామని చెప్పారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ సరోజ్‌భాష, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అజ్మీర్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం

అజ్మీర్ దర్గాలో జకియా ఖానం ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ మయాన జకియా ఖానం అజ్మీర్ షరీఫ్ చేరుకుని ఖాజా గరీబ్ నవాజ్ రహంతుల్లా అలై దర్గాలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి అయితే దర్గాకు వెళ్లాలని భర్త అఫ్జల్ అలీఖాన్ అనుకున్నారని, ఆయన మృతి చెందడంతో ఆ కోరిక అలాగే ఉండిపోయిందని తనకు శస్త్ర చికిత్స చేయడంతో కొన్నాళ్లపాటు విశ్రాంతి తీసుకుని ఇప్పుడు కొంత వరకు కోలుకోవడంతో తన భర్త మొక్కుబడిని తీర్చుకోవడానికి అజ్మీర్ షరీఫ్ చేరుకోన్నానని ఆమె పేర్కొన్నారు.

ఉర్దూ కవితా పితామహుడు అల్లామా ఇక్బాల్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సారే జహాసె అచ్ఛా.. హిందుస్తాన్ హమారా గేయ రచయితగా సుప్రసిద్ధుడైన అల్లామా మహమ్మద్ ఇక్బాల్ జయంతిని చింతపర్తి ప్రాథమి కోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు సలీం ఖాన్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో తన రచనలతో ముఖ్యంగా సారే జహాసే అచ్ఛా హిందుస్తాన్ హమారా అనే జాతీయ గీతాన్ని రచించడంతోపాటు భారతదేశ సమగ్రతను కులమతాలకు అతీతంగా, భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదంతో తమ కవిత్వాలతో ఎనలేని స్ఫూర్తిని నింపి చైతన్య పరిచారన్నారు. స్వాతంత్ర పోరాటంలో ప్రాణంకంటే మన భారత దేశ మట్టి గొప్పదని భారతీయులలో స్ఫూర్తి నింపారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రిజ్వాన్ బేగం, ఇర్షద్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు సలీం ఖాన్

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యా హక్కు చట్టం అమలుచేయని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. బుధవారం డిఇఒ రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకుండా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్య తేజ స్కూల్ దాదాపు వెయ్యిమందికిపైగా విద్యార్థులంటే ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తూ కనీసం మౌలిక వసతులు కల్పించడం లేదని పేర్కొన్నారు. ఏ ఒక్క ప్రయివేట్ పాఠశాలలకువెళ్లడానికి కూడా కనీసం రోడ్డు సదుపాయం కూడా లేదని తెలిపారు. కొన్ని ప్రయివేట్ పాఠశాలలైతే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పదేపదే చెబుతున్నప్పటికీ యాజ మాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రధానంగా ఎంఇఒల పర్యవేక్షణ పూర్తిగా విఫలం చెందిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శని, ఆదివారాల్లో తరగతి నిర్వహిస్తూ ఉన్నప్పటికీ జిల్లా , మండల విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం చాలా దారుణం అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ఫీజుల పైన అవగాహన కల్పించాల్సిన అవసరం జిల్లా విద్యాశాఖ అధికారులపైందన్నారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన గుర్రంకొండ ఎబిసి పాఠశాల పై రూ. రెండు లక్షల వరకు జరిమానా విధించామని చెప్పారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాయచోటి నాయకులు అంజి ,లోకేష్ ,మోహిత్, జాన్ కుమార్, భారత్ పాల్గొన్నారు.

పిహెచ్‌సికి 300 ఐవి కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం లయన్స్ క్లబ్ రాయచోటి శాఖ ఆధ్వర్యంలో 300 ఐవి కిట్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షులు షేక్ మొహమ్మద్ తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి, మండలం దియ్యాలవాండ్లపల్లి గ్రామానికి చెందిన కుడుముల రామలింగారెడ్డి ఆర్థిక సహకారంతో పిహెచ్‌సికి 300 స్కేల్ప్ వేయిన్ సెట్లను అందజేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ప్రస్తుతం సీజన్‌లో ఎక్కడ చూసినా జ్వరాలు విపరీతంగా ఉన్నాయని, ఆస్పత్రిలో ఐవి కిట్లు లేకపోవడం గుర్తించి కుడుముల రామలింగారెడ్డి స్కేల్ప్ వేయిన్ సెట్లను అందజేస్తామని చెప్పారు. రాబోవు రోజులలో తమ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ తరపున దాతల సహకారంతో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి మా వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రామాపురం మెడికల్ ఆఫీసర్ విజయకుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. వారు చేస్తున్న సేవలు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీజన్ జ్వరాలు ఉన్నాయని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పిహెచ్‌సికి 300 ఐవి కిట్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. అనంతరం దాత కుడుముల రామలింగారెడ్డి మాట్లాడుతూ తనవంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ ఆసుపత్రికి తన వంతుగా ఐవి కిట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ శివారెడ్డి, లయన్ హరీష్ చంద్ర, నందని ట్రావెల్స్ వినోద్ కుమార్ నాయక్, విజయ్ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ రాఘవేంద్ర రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్‌కు కిట్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

బెస్తలను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

కరపత్రం ఆవిష్కరిస్తున్న బెస్త సంఘం నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మత్స్యకార సొసైటీలను బలోపేతం చేయడానికి, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి పాటుపడల్సిన అధికారులు సొసైటీలతో కుమక్కై అన్యాయం చేస్తున్నారని చిత్తూరు జిల్లా మత్స్యకారుల సేవ సంఘం నాయకులు ముడితం వెంకటరమణ, క్రిష్ణమూర్తి విమర్శించారు. మత్స్యకారుల సమస్యలపై బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బెస్తాలను ఎస్టీ జాబితాలో చేర్పించాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం చేపలు పట్టడం ద్వారానే జీవనం సాగించే బెస్తల జీవన విధానం దారుణంగా వుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ జాబితాలో చేర్పించాలనే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. చేపలు పట్టే సాంప్రదాయ వృత్తి నిర్వహిస్తున్న బెస్త, గంగపుత్రలకు సంక్షేమ పథకాలు అందేల చర్యలు తీసుకోవాలని, మత్స్యకార సొసైటీల ద్వారా చేపలు విక్రయించడానికి స్టాల్స్ కేటాయించాలని కోరారు. మత్స్యకార సొసైటీలు కొంత మంది చేతుల్లో ఉన్నాయని, వాటిలో కొత్తగా సభ్యులు చేరడానికి అవకాశం వున్న వాటిని ఏర్పాటు చేసిన వారు ఎక్కడ వున్నారో తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. అధికారులు, సొసైటీ నిర్వహకులు కుమ్మకై సొసైటీలను నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా బెస్తల సంక్షేమానికి పాటు పడుతామని ప్రకటించారు. తమను ఎస్టీ జాబితాలో చేర్పించే వారికి సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. సమావేశంలో రఘుబాబు, గిరిధర్, సుబ్రహ్మణ్యం, ప్రకాష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు రూరల్

కేంద్ర సామాజిక న్యాయం సాధికారత శాఖ మంత్రి నారాయణస్వామికి పలు సమస్యలపై ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వెంబడి రాధాకృష్ణ, నగరిపాటి చంగయ్య బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సుదీర్ఘ పోరాటం చేస్తున్నామని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారన్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిదేళ్లయినా ఇంత వరకు పార్లమెంటులో వర్గీకరణ విషయాన్ని మాట్లాడకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సమస్యను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి వచ్చే పార్లమెంటు సమావేశంలో బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి రైల్వేకోడూరు నుండి సాయి డిగ్రీ కాలేజీ మీదుగా ఉర్లగడ్డ పోడు వరకు ఉన్న దారి సమస్యను తీర్చాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ తహశీల్దార్‌కు చెప్పి కనీసం 10 అడుగుల రస్తాను ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు గొంటి వెంకట సుబ్బయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

బొప్పాయిలో తెగుళ్లపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కలికిరి

బొప్పాయిలో కాండం మొదలు కుళ్లు తెగులు వర్షాకాలంలో సాధారణంగా వచ్చే వ్యాధి అని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. ఈ వ్యాధి సోకిన మొక్క కాండం మొదలు కుళ్లిపోయి మొక్క వాలిపోయినట్టుగా కనబడుతుందని తెలిపారు. కాయలు ఉన్న చెట్లకు ఆశించిన నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ వ్యాధి లక్షణాల లో సోకిన మొక్క మొదలు నుండి జిగురులాంటి ద్రావణం కారుతుందని చెప్పారు. దీని నివారణకు మొక్క మొదలు దగ్గర నీరు నిలవకుండా చూడాలని సూచించారు. ఈ తెగులును పొలంలో గమనించినప్పుడు ఒక కిలో ట్రైకోడెర్మా విరిడి శిలీంద్రమును 190 కిలోల పశువుల ఎరువు మరియు 10 కిలోల వేప పిండి కలిపి నీడలో ఉంచి రోజు మార్చి రోజు నీళ్లు చల్లుతూ పది రోజుల తర్వాత చెట్ల పాదుల్లో వేయాలని పేర్కొన్నారు. ఈ వ్యాధి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు రిడోమిలి ఎం.జెడ్. రెండు గ్రాములు లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు చొప్పున లీటర్ నీటికి కలిపి మొదల దగ్గర, కాండాన్ని తడుపుతూ పోయాలని, వారం రోజుల వ్యవధిలో రెండు నుండి మూడు సార్లు తడపాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-రామసముద్రం

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల తీరును బుధవారం ఎంపిపి కుసుమకుమారి పరిశీలించారు. బుధవారం ఆమె వైద్యాధికారితో మాట్లాడుతూ పేద ప్రజలకు మంచి వైద్య సేవలను శ్రద్ధ, క్రమశిక్షణతో అందించాలన్నారు. ప్రభుత్వం కూడా విద్యా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. డాక్టర్‌లు, నర్సుల కొరతను సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన గర్భిణులతో ప్రభుత్వం తరపున అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం శుభ్రత పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రమణారెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సచివాలయ భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మండల ఇంజినీర్ మహమ్మద్ జియా ఫాజిల్ పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న నాలుగో సచివాలయం నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షిస్తున్నారు. బుధవారం గుత్తేదారులు కంచి బలరాంరెడ్డి, ఎం.వి.కృష్ణయ్యలతో కలిసి సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల విధానాలను ఇంజినీర్ అసిస్టెంట్ వారికి వివరించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ జియా ఫాజిల్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చేందుకు ప్రత్యేక భవనాలను నిర్మిస్తోందన్నారు. దృష్టిలో ఉంచుకొని సచివాలయ భవన నిర్మాణాలను నాణ్యతతో పాటు, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సచివాలయం గుణాది పనులు జరుగుతున్నాయని, నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రభుత్వం తమకు ఇచ్చిన గడువులోగా నాలుగో సచివాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

రేపు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనాపురం పంచాయతీ కొండవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న బాలబాలికల అండర్ -17 విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆట్య, పట్య జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రెడ్డమ్మ పేర్కొన్నారు మండలంలోని కొండలపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 14, 16 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు 2005 జనవరి 1 తర్వాత జన్మించిన క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలలో అర్హులని ఆమెపేర్కొన్నారు. కార్యక్రమంలో కొండవాండ్లపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శామీర్‌బాష, పీడీ దయదేవేందర్ పాల్గొన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అండర్-17 బాలబాలికల బాస్కెట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం వాల్మీకిపురం ఎవిఎస్ గవర్నమెంట్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు డివైఇఒ కృష్ణప్ప, స్కూల్ గేమ్స్ సెక్రటరీ రమలు తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు తప్పకుండా మానిటరింగ్ సిస్టం ఆఫీసులో రిజిస్టర్ చేసుకోవాలని, వారికి మాత్రమే జిల్లా స్థాయి ఎంపికకు అర్హులని తెలిపారు. ఈ ఎంపికకు ప్రతి పాఠశాల నుండి ఒక విభాగానికి నలుగురు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. 1-1-2006 తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ములకలచెరువు

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చౌడసముద్రం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కొన్ని సామాజిక వర్గాలకు మాత్రమే కొమ్ము కాసిందని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సాయిలీలా, జడ్‌పిటిసి మోహన్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, సర్పంచులు రాంబాబు, జయచంద్ర కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు ఆముదాల మధుసూదన్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, చాంద్‌బాషా, రెడ్డి భాష,విశ్వనాధ్ పాల్గొన్నారు.

నత్తల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నత్తల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ, అధికారులు ఆషియా, సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని సెట్టిగుంట ప్రాంతంలో వారు పర్యటించి బొప్పాయి తోటలను పరిశీలించారు. ఈ సందరేగా వారు మాట్లాడుతూ వీటిపై భాగం పెంకుతో కప్పబడి, కిందభాగం మెత్తని దేహం కలిగి ఉంటా యన్నారు. సహజంగా తడి, చిత్తడి నేలల్లో ఎక్కువగా జీవిస్తుంటాయని తెలిపారు. పగలంతా మట్టిపెలల,చెట్ల పొదల్లో దాకొని రాత్రిపూట పంటను నాశనం చేస్తుంటాయని పేర్కొన్నారు.

గుర్రాలమిట్ట వద్ద ఉన్న లే అవుట్లను పరిశీలిస్తున్న పీడీ

లే అవుట్లను తనిఖీ చేసిన పీడీ

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు, గోరాన్ చెరువు గ్రామాల పరిధిల్లోని హౌసింగ్ లేఅవుట్లను బుధవారం అన్నమయ్య జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివయ్య తనిఖీ చేశారు. గుర్రాల మిట్ట, అరవిటివాళ్లపల్లి పెట్రోల్ బంక్ వద్దనున్న లే అవుట్లను పరిశీలించారు. ఎంతమంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టారని ఆరా తీశారు. వీధులు, విద్యుత్ లైనట్లను తనిఖీ చేశారు. ఆయన వెంట డిఇ శ్రీనివాసమూర్తి, ఇఇ గోపాల్ నాయక్, ఎఇ జనార్దన్, తహ శీల్దార్ దైవాదీనం, ఎంపిడిఒ శేఖర్‌నాయక్, వైస్ ఎంపిపి మిట్టపల్లి యదు భూషణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్ మహేంద్రారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్దను పరిశీలిస్తున్న ఎంఇఒ రామకృష్ణుడు

మెనూను పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం అమలు చేయాలని మండల విద్యాధికారి రామకృష్ణుడు అన్నారు మండలంలోని సరస్వతిపల్లి దళితవాడలో మండల ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరు ఉపాధ్యాయ హాజరు పట్టికలను పరిశీలించారు, మధ్యాహ్న జగనన్న గోరుముద్ద పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు అధిక శాతం హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. నాడు నేడు పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని అన్నారు

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ : 'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పంచాయతీ పరిధిలోని చక్రవాండ్లపల్లి, రాజువారిపల్లి, సత్యాపురం గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామాలలో ప్రజల నుండి సమస్యల పరిష్కరించాలని వినతులు సమర్పించారు. ఇళ్లు, పింఛను, ఆసరా రాలేదని పలు సమస్యలు ఎమ్మెల్యే వద్దకు రాగవారి సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో చర్చించి వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. చక్కెర వాండ్లపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని రోహిత రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో డయాలసిస్ చేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో పెన్షన్‌కు అప్లై చేశామని తెలిపారు. డిఎంహెచ్‌ఒతో మాట్లాడి ఆమె సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఆమె డయాలసిస్ కొరకు తిరుపతి వెళ్లడానికి ఉచితంగా 108 పర్మిషన్ ఇవ్వాలని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజాలోకి వర్ధన్ సర్పంచులు వెంకట్రెడ్డి, గంగయ్య, ప్రత్యేక ఆహ్వానితుడు రిజ్వాన్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఎస్‌టిడి హరి, ప్రత్యేక ఆహ్వానితులు సతీష్‌రెడ్డి రత్న, శేఖర్ రెడ్డి ఎంపిటిసి శ్రీకాంత్ యాదవ్ నాయకులు బావాజీ, వేణు ఎంపిడిఒ గంగయ్య, ఎంఇఒ రంగనాథరెడ్డి మేజర్ పంచాయతీ ఇఒ, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో కాన్పులు సురక్షితం : డాక్టర్

ప్రజాశక్తి- కలకడ

గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే వైద్య సేవలు పొందాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్ బాబు కోరారు. బుధవారం మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణి ప్రభుత్వ వైద్యశాల నుండి చికిత్స పొంది ప్రసవాలు కూడా అక్కడే పొందేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇళ్లు తిరిగి వైద్య సేవలు అందించవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. 10 గ్రాముల లోపల రక్తము వున్నవాళ్లు విధిగా ఐరన్ శుక్రజ్ ఇంజక్షన్ వాడాలని తెలిపినారు. ప్రతినెలా 9, 10వ తేదీలలో తప్పకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చి అన్నిరకాల పరిక్షలు చేయించుకోవాలని తెలిపినారు. హై రిస్క్ గర్భిణులు ఉన్నత స్థాయి ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి తరచూ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గర్భవతులు ప్రతిరోజు పాలు, గుడ్లు, ఆకు కూరలు అన్నిరకాల పండ్లు తినాలని, పౌష్టికహారం తీసుకోవాలని సూచించారు. 38 మంది గర్భిణులు హాజరయ్యారు. కార్యక్రమములో ఎంపీహెచ్‌ఇఒ జయరామయ్య, పిఎన్ఎం సుబ్బరత్న,సూపర్ వైసర్ ముజీబ్,స్టాఫ్ నర్స్ భారతి, ల్యాబ్ టెక్నీషియన్ జమీల్, ఎల్‌డి కంప్యూటర్ ఇస్మాయిల్, ఫార్మాసిస్ట్ షరీఫ్, ఎంఎల్ హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి:-మదనపల్లె అర్బన్

కుటుంబ కలహాలతో ఓ వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన తంబళ్లపల్లి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు...మండలంలోని రెడ్డికోటకు చెందిన శివశంకర్ భార్య పి.లక్ష్మీదేవి వ్యవసాయ పనులకు వెళ్లడం లేదని భర్త మందలించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న బూటాక్స్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు బాధితురాలని మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ములకలచెరువు

కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ మల్లిక తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం మండలంలోని టి.సదుం గ్రామంలో కర్నాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో టి.సదుంకు చెందిన నరసింహులు మద్యం అమ్ముతూ పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన నిందితుని నుంచి 40 మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన నిమ్మనపల్లి మండలంలో చోటుచేసుకుంది. కొండయ్యగారిపల్లికి చెందిన ఎం.వెంకటరమణారెడ్డి కందూరు వైపు నుండి నిమ్మనపల్లికు వస్తుండగా పెద్దమాదిగపల్లి సమీపంలోని దామరఒడ్డుకట్టపై నిమ్మనపల్లి నుండి సైదాపేటకు వెళ్తున్న ఎస్.అలీబాషా ద్విచక్ర వాహనాన్ని ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వెంకటరమణారెడ్డి తలకు తీవ్ర గాయం కావడంతో నిమ్మనపల్లి పిహెచ్‌సిలో ప్రథమ చికిత్స అందించి 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం స్వల్ప గాయాలైన ఆలీ బాషాను కూడా మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.